ప్రాజెక్టులకు భారీ వరద 2





3 పెరిగిన సేవా రుసుములు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## శ్రీరాంసాగర్‌ను సందర్శించిన మంత్రి జూపల్లి



**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాం సాగర్ ప్రాజెక్టును మంగళ వారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యా టక శాఖ మంత్రి జూపల్లి కృ ష్ణారావు, మాజీ మంత్రి ఇం ద్రకరణ్ రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను.. దిగువకు వదులుతున్న అవుట్‌ఫ్లోను అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం 39 గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుపైకి పర్యాటకు లను అధికారులు అనుమతించట్లేదు.

19-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 3



## బ్యాక్‌వాటర్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్

**అక్షరటుడే, బోధన్ :** భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు ముంపు గ్రామాల్లో విస్తృతంగా పర్య టిస్తున్నారు. అధికారులకు సూచనలు సలహాలు ఇస్తు న్నారు. ఇందులో భాగంగా బోధన్ మండలం హంగర్గ గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ మంగళవా రం పరిశీలించారు. ముందస్తు చర్యల్లో భాగంగా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామాన్ని సందర్శించి బ్యాక్ వాటర్ ప్రవాహాన్ని పరిశీలించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తహశీల్దార్ విఠల్‌కు సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిం చాలన్నారు. వరద ఉధృతి పెరిగితే గ్రామస్థులను పునరా వాస కేంద్రాలకు తరలించాలని ఆయన చెప్పారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** వనమహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించా లని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు సూచించారు. తెయూ ఎన్ఎస్ఎస్ విభాగం యూనిట్ -1,యూనిట్ -2 ఆధ్వర్యంలో సైన్స్ కళాశాల ఆవరణలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కల పెంపకం అత్యంత ఆవశ్యకమన్నారు. భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే ఆస్తి పర్యావరణాన్ని పరిరక్షించడ మేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, కామర్స్ డీన్ రాంబాబు, డైరెక్టర్ (పీఆర్వో) పున్న య్య, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, నందిని, అతిక్ సుల్తాన్ ఘోరి, అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్, మొహమ్మద్ అబ్దుల్ ఖవి, ప్రొఫెసర్ లావణ్య, ప్రసన్న రాణి, ప్రోగ్రాం ఆఫీసర్లు స్వప్న, స్రవంతితో పాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొందరు కిలేడీలు రెచ్చిపోతున్నారు. లిఫ్ట్ అడిగి బైక్‌పై ఎక్కి మధ్యలోకి వెళ్లాక ఉన్నదంతా దోచుకుంటున్నారు. ముఠాగా ఏర్పడి వీరు మోసాలకు పాల్పడుతున్నారు. ఒంటరిగా వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకొని దోపిడీ చేస్తున్నారు. పాపం పోని అని లిఫ్ట్ ఇస్తున్న వారు వీరి మోసాలకు బలవుతున్నారు. ఇటీవల జిల్లాలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో లిఫ్ట్ ఇవ్వడానికి ప్రజలు ఆలోచిస్తున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

# కిలేడీలు..



- బైక్‌పై లిఫ్ట్ అడిగి మోసం చేస్తున్న వైనం
- ఒంటరిగా వెళ్లేవారే లక్ష్యం
- ముఠాగా ఏర్పడి దారి దోపిడీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

బైక్‌పై ఒంటిరిగా వెళ్తున్న వారిని ఈ మాయ లేడీలు ఆపుతారు. తాము అదే దారిలో వెళ్తున్నామని నమ్మ బలుకుతారు. ఒంటరిగా ఉన్నామని లిఫ్ట్ ఇవ్వమని కోరుతారు. వారి మాటలు నమ్మి లిఫ్ట్ ఇచ్చారంటు అంతే సంగతులు. వెనకాలే బైక్‌పై వారికి సంబంధించిన వ్యక్తులు ఫాలో అవుతారు. జన సంచారం లేని ప్రాంతంలో బైక్ ఆపి, బెదిరింపులకు పాల్పడుతారు. "నా భార్యతో నీకు ఏమి పని"అని లిఫ్ట్ ఇచ్చిన వారిని బెదిరిస్తాడు. లిఫ్ట్ అడిగిన మహిళ, మరో వ్యక్తి కలిసి అతడిని భయపెడతారు. అనంతరం జేబులో ఉన్న నగదు, ఒంటిపై బంగారం, ఫోన్లు లాక్కొని ఉడాయిస్తారు.

### జేబులు గుల్ల

రాత్రి పూట మహిళ ఒంటరిగా ఉండడంతో పలువురు లిఫ్ట్ ఇస్తున్నారు. అయితే లిఫ్ట్ ఇచ్చిన పాపానికి వారి జేబులు గుల్ల అవుతున్నాయి. కొద్దిదూరం వెళ్లేదాక వారి అసలు పథకం అర్థం కావడంలేదు. నెల రోజుల్లో జిల్లాలో ఇలాంటి ఘటనలు రెండు చోటు చేసుకున్నాయి. గత నెల 18న దోమకొండ మండలం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అశోక్ నగర్ కాలనీలో కల్లు దుకాణం వద్ద కలిసిన ఓ మహిళ మాటల్లో పెట్టింది. తనను మధ్యలో దింపాలని కోరింది. అనంతరం బైకుపై ఎక్కి పట్టణ శివారులో మరొక ఇద్దరితో కలిసి బెదిరించి రూ.28 వేల నగదు కొల్లగొట్టింది.

తాజాగా ఈ నెల 10న రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి కూడా ఇదే విధంగా మహిళకు లిఫ్ట్ ఇచ్చి రూ.2 వేలు, ఫోన్ పోగొట్టుకున్నాడు. మూడు నెలల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని ఓ మహిళ క్యాసంపల్లి వద్ద లిఫ్ట్ అడిగింది. పట్టణంలోని రాజీవ్ పార్కు వద్ద మరొక ఇద్దరిని రప్పించి జేబులో ఉన్న రూ.500, ఫోన్ పే ద్వారా రూ.1100 పంపించుకుంది. ఇలా చాలా మంది మోసపోతున్నారు. అయితే కొంతమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పెరుగుతుండటంతో తెలియని వారికి లిఫ్ట్ ఇవ్వడానికి కూడా ప్రజలు ఆలోచిస్తున్నారు.



### గుర్తు తెలియని వారికి లిఫ్ట్ ఇవ్వొద్దు



రాత్రి పూట గుర్తు తెలియని మహిళలు లిఫ్ట్ అడిగితే ఇవ్వొద్దు. తాము అటువైపే వెళ్తున్నామని చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దు. గుర్తు తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి. ఎవరిపైన అయినా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– నరహరి, కామారెడ్డి పట్టణ సీఐ

## దెబ్బతిన్న పంటల పరిశీలన



నీటమునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**అక్షరటుడే, నిజాంసాగర్:** జుక్కల్ మండలంలోని నాగుల్‌గావ్ గ్రామాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు మంగళవారం సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు, చెడిపోయిన రోడ్లు, కల్వర్టుల పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, తహశీల్దార్, వ్యవసాయ శాఖ, ట్రాన్స్‌కో అధికారులు ఉన్నారు.

## సెంట్రల్ జైలులో ఖైదీలకు వైద్యపరీక్షలు



అక్షరటుడే

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా సారంగాపూర్ సెంట్రల్ జైలులో ఖైదీలకు టీబీపై అవగాహన, వైద్య పరీక్షలు నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్యాధికారిణి రాజశ్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైలులోని 560 ఖైదీలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఖైదీలకు టీబీ స్క్రీనింగ్, మొబైల్ ఎక్సరే ద్వారా ఎక్సరేలు తీయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ చింత దశరథం, జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ దేవినాగేశ్వరి, టీవీ మెడికల్ ఆఫీసర్ అవంతి, జైలర్ రాజశేఖర్, జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దినేష్, జిల్లా టీబీ కోఆర్డినేటర్లు రవిగౌడ్, లక్ష్మణ్, స్వాతి, మహేష్, జైలు ఫార్మసిస్ట్ రాంచందర్, టీబీ సూపర్‌వైజర్ స్రవంతి, టెక్నీషియన్ సాయికిరణ్, శివ, ఖలీద్, శంకర్ రాథోడ్ పాల్గొన్నారు.

## బీజేపీకి అనుకూలంగా లేని రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపు

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**అక్షరటుడే, కామారెడ్డి:** బీజేపీకి అనుకూలంగా లేని రాష్ట్రాల్లో ఓట్లను తొలగిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభకు హాజరయ్యారు. అనంతరం ఆయన ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. బీహార్‌లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో 65 లక్షల ఓట్లు తొలగించడం జరిగిందని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా లేని రాష్ట్రాల్లో ఓట్లు తొలగిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలను సీపీఎం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన వాటిపై కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని జాన్ వెస్లీ అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎం నాయకులు వెంకట్ గౌడ్, మోతీరాం నాయక్, కొత్తపల్లి నర్సింలు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలు పూర్తయి ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి. దీంతో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి పరిశీలించారు. జైతాపూర్‌లో 74 ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభమై, వివిధ దశలలో కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటిలో 15 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్.. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించిన ఆయన యుద్ధ ప్రాతిపదికన వాటిని పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

### వెంటనే బిల్లులు మంజూరు చేయాలి

నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు చెల్లింపులు పూర్తయ్యాయా.. అని కలెక్టర్ ప్రశ్నించారు. చివరి బిల్ చెల్లించలేదని అధికారులు పేర్కొన్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేసి విద్యుత్ కనెక్షన్, మిషన్ భగీరథ నీటి సరఫరా వంటి సదుపాయాలను సత్వరమే కల్పించాలని ట్రాన్స్‌కో ఏఈ ముఖ్తర్‌ను, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాకేష్‌కు సూచించారు. ప్రారంభోత్సవాల నాటికి చిన్న పని కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ పవన్ కుమార్, నివర్తి ఉన్నారు.

## టూరిజం స్పాట్‌గా నిజాంసాగర్ ప్రాజెక్టు



**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టును టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రాజెక్టు వద్ద ఉన్న గోల్ బంగ్లా, గార్డెనింగ్, బోటింగ్ పాయింట్ పరిసరాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి, నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్‌తో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ భాగం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో.. దిగువకు వదులుతున్న వరద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు కట్టను పరిశీలించి అక్కడ పిచ్చిమొక్కలు, వర్షం నీరు నిల్వవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గోల్ బంగ్లా వద్ద కొనసాగుతున్న టూరిజం పనులను పరిశీలించారు. రూ. 10 కోట్ల వ్యయంతో టూరిజం పనులు కొనసాగుతున్నాయని ఏడాదిలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పనులు పూర్తయితే ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా మారి పర్యాటకులకు మరింత కనువిందు చేస్తుందని చెప్పారు. అనంతరం ఆరేడు గ్రామ శివారులోని 20 వరద గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదలను పరిశీలించారు. మెయింటెనెన్స్‌లో భాగంగా 20 వరద గేట్ల పనితీరును ఇంజినీర్ల బృందం పరిశీలించేందుకే నీటి విడుదల చేపట్టారని కలెక్టర్ వివరించారు. మంజీర పరీవాహక ప్రాంతంలోకి మత్స్యకార్మికులు, రైతులు వెళ్లవద్దని సూచించారు. వారి వెంట ఈఈ సొలోమాన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, తహశీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్ శివకుమార్, ప్రాజెక్టు ఏఈ సాకేత్, ఆయా శాఖలకు చెందిన అధికారులు తదితరులున్నారు.

## విద్యుత్ స్తంభాల నుంచి కేబుల్ వైర్ల తొలగింపు



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని విద్యుత్ స్తంభాల నుంచి బ్రాడ్‌బ్యాండ్, డిష్ కేబుళ్లను అధికారులు మంగళవారం తొలగించారు. విద్యుత్ మరమ్మతులు చేపట్టే సమయంలో ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నాగారం సెక్షన్‌లోని ఆర్ఆర్ చౌరస్తా పరిధిలో వీటిని తొలగించారు.



నుడా చైర్మన్ కేశ వేణు జన్మదిన సందర్భంగా 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ రమేష్ గారి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు..

## శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని సీఐ అశోక్ సూచించారు. పట్టణంలో మంగళవారం పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. డీజేలు, పెద్దఎత్తున శబ్దాల సౌండ్ సిస్టమ్స్ వాడకూడదని సూచించారు.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**అక్షర టుడే, ఆర్మూర్:** వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి అన్నారు. నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలోని మున్నూరు కాపు సంఘంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని, విగ్రహ ప్రతిష్టాపన, ఊరేగింపు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అధిక శబ్దం చేసే డీజేలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో నందిపేట ఎస్సై శ్యామ్ రాజ్, రామ్, యువకులు పాల్గొన్నారు.

## వినాయక మండళ్లు నిబంధనలు పాటించాలి



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నగరంలోని వినాయక మండళ్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ శ్రీనివాస్‌రాజు సూచించారు. వినాయక్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మండపాల వివరాలు పోలీస్‌శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యుత్‌కు సంబంధించిన అనుమతి సైతం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ సౌత్ తహశీల్దార్ బాలరాజు, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఏడీఈ చంద్రశేఖర్, మున్సిపల్ ఏఈ వాజీద్ పాల్గొన్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న వరద నీరు



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి..

# ప్రాజెక్టులకు భారీ వరద

ఉమ్మడిజిల్లాలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఎగువ నుంచి భారీగా వరద వచ్చిచేరడంతో శ్రీరాంసాగర్, నిజాంసాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదలుతున్నారు. దీంతో ప్రాజెక్టులను తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. కందకుర్తి వద్ద గోదావరి ఉధృతికి వంతెనపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో అంతర్రాష్ట్ర రహదారిని అధికారులు మూసివేశారు. మంజీర నది పొంగిపొర్లడంతో బీర్కూరు మండలంలోని వంతెన పైనుంచి సైతం వరద పొంగిపొర్లుతోంది. దీంతో ప్రమాదకరంగా మారిన వంతెనల వద్దకు ప్రజలు వెళ్లవద్దని అధికారులు పేర్కొన్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్





35 ఏళ్ల తర్వాత ఆరేడు వైపు ఎత్తిన గేట్లు



కందకుర్తి వద్ద వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది..

## నుడా ఛైర్మన్ జన్మదిన వేడుకలు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కేశ వేణు జన్మదినాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### శంభునిగుడిలో అభిషేకాలు..





నగరంలోని శంభుని గుడి ఛైర్మన్ బింగి మధు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శంభు లింగేశ్వర ఆలయ కమిటీ సభ్యులు రక్తందానం చేశారు. రక్తదాన శిబిరంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బింగి మధు, వినోద్, గాండ్ల సంతోష్,

## మంజీర వంతెనపై రాకపోకలు నిలిపివేత



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూరు శివారులో వాగు ఉధృతంగా పొంగిపొర్లుతోంది. దీంతో బీర్కూర్ నుంచి మంజీర వంతెన మీదుగా రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఎస్సై రాజశేఖర్, ఎంపీడీవో మహబూబ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ను అడ్డుగా పెట్టి రోడ్డును మూసివేశారు. వరదనీటి కారణంగా మంజీర వారధి పైనుంచి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు పేర్కొన్నారు. వాహనదారులు ఈ దారి వైపు రావొద్దని సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని, మంజీర నదిలో వరద ప్రవాహం తీవ్రంగా ఉండడంతో జాలర్లు చేపల వేటకు వెళ్లకూడదని ఎస్సై హెచ్చరించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, నిజాంసాగర్ :** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పిట్లం ఎస్సై వెంకట్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మంగళవారం షీ టీమ్, పోలీస్ బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ నేరాలబారిన పడితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డయల్ 100, డ్రగ్స్ నియంత్రణ, తదితర అంశాలపై కళాబృందం సభ్యులు పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు శేషారావు, ప్రభాకర్, సాయిలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలోని బంజేపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ ప్రమీల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు వివరాలు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని టీచర్‌ను ఆదేశించారు. సమయపాలన పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంపీడీవో గంగాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, అనిత, తదితరులున్నారు.

## బోధన్‌లో పావురం కలకలం..



**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మండలంలో ఓ పావురం కలకలం రేపింది. భవానిపేట గ్రామంలో బాలుడికి పావురం దొరికింది. అయితే దాని కాలికి కోడ్ రింగ్ ఉండడంతో గూఢాచారి పావురం అంటూ ప్రచారం జరిగింది. దీంతో స్థానికులు ఆందోళన చెందారు. రెక్కలపై కోడ్ లెటర్స్ ఉండడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పావురాన్ని స్వాధీనం చేసుకున్నారు. దానిని ఠాణాకు తరలించి దర్యాప్తు చేశారు. దీనిపై బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌ను వివరణ కోరగా.. అది గూఢాచారి పావురం కాదని చెప్పారు. రేసింగ్ పావురంగా గుర్తించినట్లు తెలిపారు.


## న్యూసెన్స్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి న్యూసెన్స్ చేసిన కేసులో ఒకరికి, డయల్ 100ను మిస్ యూజ్ చేసిన మరొకరికి కోర్టు రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ఐదో టౌన్ పోలీసులు తెలిపారు. ఈనెల 14న బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన ఆలకొండ గంగాప్రసాద్, ఈనెల 16న రాత్రి సమయంలో మద్యం సేవించి డయల్ 100కి ఏడుసార్లు కాల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఎండీ రిజ్వాన్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చారు. దీంతో విచారించిన న్యాయస్థానం ఇద్దరికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

## మహిళ హత్య కేసులో యువకుడికి యావజ్జీవ శిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** మహిళను రోకలి కర్రతో కొట్టి హత్య చేసిన యువకుడికి జిల్లా న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్తే.. బిచ్కుందలోని శివాజీనగర్ కాలనీ వాసి పండరి కూలిపని చేస్తుండేవాడు. అయితే జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతూ వచ్చాడు. ఈ క్రమంలో తన ఇంటి వద్ద ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు కాశవ్వను 2024 సెప్టెంబర్ 29న ఆమె ఇంట్లోనే రోకలికర్రతో తలపై కొట్టి హత్య చేశాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్లు, చెవికమ్మలు చోరీ చేసి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న కామారెడ్డి పోలీసులు విచారణ చేసి అనుమానితుడిగా పండరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జిల్లా న్యాయస్థానం పండరే హత్య చేసినట్లుగా ధృవీకరించి అతడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కాశవ్వ షెడ్యూల్డ్ కులానికి చెందిన మహిళగా గుర్తించిన కోర్టు మరో ఐదేళ్ల కారాగార శిక్ష విధించింది. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించింది.

## ఏటీఎంలో చోరీకి యత్నం..



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడో పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం చోరీ యత్నం ఘటన చోటుచేసుకుంది. చంద్రశేఖర్ కాలనీలో గల ఏటీఎం వద్దకు ముగ్గురు దుండగులు మారుతి వ్యాన్‌లో వచ్చి లోపలికి చొరబడ్డారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్ ను పగులగొట్టారు. ఏటీఎం యంత్రాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. నగదు దొంగిలించే ప్రయత్నం చేయగా.. అప్పుడే పెట్రోలింగ్ సిబ్బంది అటుగా రావడంతో పోలీసులను చూసి దుండగులు వ్యాన్‌లో పారిపోయారు. వెంటనే పెట్రోలింగ్ సిబ్బంది వారిని వెంబడిస్తూనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు ఆయా ఠాణాల పోలీసులను అప్రమత్తం చేశారు. అలా మూడో టౌన్‌తో పాటు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది దుండగులను వెంబడించారు. వారు బాసర వైపు వ్యాన్‌లో పారిపోతుంటే.. వెనుక పోలీసులు ఛేజింగ్ చేశారు. దీంతో నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల్దా గ్రామం వద్ద దుండగులు వ్యాన్‌ను వదిలిపెట్టి పారిపోయారు. అప్పటికే అన్ని దిక్కుల నుంచి నిజామాబాద్ డివిజన్ పోలీసులు చుట్టుముట్టారు. దీంతో దుండగులు వాహనం వదిలిపెట్టి, చీకట్లో పరుగులు తీశారు. దుండగుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులకు పాల్దా గ్రామస్థులు కూడా సహకారం అందిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. కొత్తవారు ఎవరైనా కనబడితే సమాచారం అందించాలని కోరారు. ఏటీఎం చోరీ దుండగులు వదిలిపెట్టి వెళ్లిన వ్యాన్ మహారాష్ట్రలో రిజిస్ట్రేషన్ అయి ఉంది. అంటే దొంగలు మహారాష్ట్ర నుంచి వచ్చినట్లుగా తెలుస్తోంది. వ్యాన్‌లో గ్యాస్ కట్టర్ పరికరాలు పూర్తిగా ఉన్నాయి. ఏటీఎం యంత్రాన్ని పగులగొట్టడానికి కావాల్సిన పరికరాలు వాహనంలో ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే.. దుండగులు ముందే రెక్కీ నిర్వహించి, పక్కా ప్లాన్‌తో చోరీకి యత్నించినట్లుగా తెలుస్తోంది.

## అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు స్వల్ప గాయాలు..

**అక్షరటుడే, గాంధారి:** కామారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. ఈ ఘటన గాంధారి మండలంలోని మంగళవార ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాన్సువాడ డిపోకు చెందిన బస్సు సీతాయిపల్లి మీదుగా ఎల్లారెడ్డి వెళ్తున్న క్రమంలో రోడ్డు సరిగా లేనందున సీతాయిపల్లి శివారులో అదుపు తప్పి రోడ్డు కిందికి దిగబడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఎక్కువ మంది ప్రయాణికులు లేకపోవడం.. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్థులు పేర్కొన్నారు. బాన్సువాడ నుంచి సీతాయిపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు పడడం.. ఇరుకుగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అనేకసార్లు ఈ రోడ్డును బాగు చేయాలని సంబంధిత అధికారులకు పేర్కొన్నప్పటికీ స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## వినాయక విగ్రహం తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్.. ఒకరి మృతి

**అక్షరటుడే, కామారెడ్డి :** వినాయక విగ్రహం తీసుకెళ్తుండగా విషాదం చోటు చేసుకుంది. విగ్రహానికి కరెంట్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామ శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వినాయక చవితి ఉత్సవాలకు యువత సిద్ధం అవుతున్నారు. మరికొన్ని రోజుల్లో పండుగ ఉండటంతో విగ్రహాలను తీసుకెళ్తున్నారు. మండపాలను సిద్ధం చేసి ప్రతిమలను కూర్చోబెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే భారీ వినాయక విగ్రహాలను తీసుకెళ్తున్న క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. సిరిసిల్లకు చెందిన 15 మంది యువకులు ఆర్మూర్ పట్టణ పరిధిలోని పెర్కిట్‌లో వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా.. పాల్వంచ మండలం ఆరేపల్లి శివారులో గల కస్తూర్బా పాఠశాల సమీపంలో ట్రాక్టర్‌లో ఉన్న ఇద్దరికి విద్యుత్ వైర్లు తగిలి కింద పడిపోయారు. వెంటనే వారిని కామారెడ్డి జీజీహెచ్‌కు తరలించగా సిరిసిల్ల గోపాల్ నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ (19) మృతి చెందాడు. సుభాష్ నగర్‌కు చెందిన సాయికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో సైతం వినాయక విగ్రహాలను తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్ తగిలి ముగ్గురు మృతి చెందారు. బండ్లగూడలో ఇద్దరు, అంబర్‌పేట్‌లో ఒకరు చనిపోయారు. వినాయక చవితికి యువత ఎంతో సందడి చేస్తారు. పెద్ద పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. అయితే వాటిని తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. విగ్రహం తీసుకు వెళ్లే మార్గంలో అడ్డుగా విద్యుత్ వైర్లు ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

## తెయూ అధ్యాపకురాలు గోల్డి బల్బీర్‌కౌర్‌కు డాక్టరేట్



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న గోల్డి బల్బీర్ కౌర్ డాక్టరేట్ సాధించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో రిటైర్డ్ ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ పర్యవేక్షణలో 'ద ఇమేజ్ ఆఫ్ న్యూ వుమెన్ స్టడీ ఆఫ్ శోభాడే సెలక్ట్ నావెల్స్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. వర్సిటీలో మంగళవారం జరిగిన మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ తిరుపతి కుమార్ ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. పరిశోధకురాలు గోల్డి బల్బీర్ పరిశోధించి విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథంలో అభ్యుదయ స్త్రీవాదం, లింగ సమానత్వం, కుటుంబ ఆర్థిక రాజకీయ స్వావలంబనపై సమగ్రంగా విశ్లేషణ ఉందని ఆయన పేర్కొన్నారు. ఆమె పరిశోధన సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని పరిశోధకురాలిని ఆయన అభినందించారు. ఈ మౌఖిక పరీక్షకు డీన్ ప్రొఫెసర్ లావణ్య, విభాగాధిపతి డాక్టర్ కేవీ రమణా చారి, ఛైర్‌పర్సన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ పి.సమత, ఎల్ జోత్స్న, ఎన్ స్వామి రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి కేటీఆర్, హన్మంత్ షిండే చిత్రపటానికి పాలాభిషేకం



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలంలోని కుర్తి గ్రామస్థులు మంగళవారం మాజీమంత్రి ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పిట్లం మండలం బీఆర్ఎస్ అధ్యక్షుడు వాసరి రమేష్ మాట్లాడుతూ.. ఒకప్పుడు నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తితే కుర్తి గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హన్మంత్ షిండే కుర్తి గ్రామాన్ని దత్తత తీసుకుని కేటీఆర్‌ను ఆహ్వానించారన్నారు. వారి హయాంలోనే ఆనాడు లోలెవెల్ వంతెన స్థానంలో హైలెవెల్ వంతెనను నిర్మించారన్నారు. వారి కృషితోనే నేడు నిజాంసాగర్ గేట్లు ఎత్తినప్పటికి స్వేచ్ఛగా కుర్తి గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టాబ్లెట్ నాయకులు లచ్చిరెడ్డి నారాయణరెడ్డి, మహిపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అశోక్, షాదుల్లా, సాయిలు, కుర్తి గ్రామస్థులు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పునరావాస కేంద్రం తనిఖీ..



**అక్షరటుడే, నిజాంసాగర్:** మహమ్మద్ నగర్ మండలంలోని తునికిపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల వర్షాలకు నీరు చేరింది. దీంతో కాలనీ వాసులను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. వారికి భోజన, వసతి కల్పించారు. ఈ మేరకు మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గ్రామాన్ని సందర్శించారు. ముంపునకు గురైన కుటుంబాలను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడి ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మహమ్మద్ నగర్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తహసీల్దార్ వైసింగ్, డిప్యూటీ తహసీల్దార్ క్రాంతికుమార్, ఆర్ఐ పండరి ఉన్నారు.



## పొలాల్లో కంకర మేటలు..

భారీ వర్షా లతో వర్ని మండలం మల్లారం శివారులో వరద ఉప్పొంగింది. రెండు రోజులుగా వర్షా లు కురుస్తుండడంతో మల్లారం అటవీ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రోడ్డుపై పారింది. జాతీయ రహదారి పనులు కోసం వేసిన ఇసుక, కంకర నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి పొలాల్లో మేట వేసింది. నష్టపోయిన పంటకు అధికారులు, కాంట్రాక్టర్ పరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. – అక్షరటుడే, బాన్సువాడ



# పెరిగిన సేవా రుసుము

- రవాణాశాఖ ఛార్జీల్లో పెరుగుదల
- వాహనదారులపై పడుతున్న ఆర్థిక భారం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రవాణా శాఖ సేవల ఛార్జీలను పెంచింది. గతంతో పోలిస్తే ధరలను ఏకంగా రెట్టింపు చేసింది. ఈ మేరకు ఆర్టీఏ కార్యాలయంలోని సర్వర్లలో కూడా మార్పులు చేశారు. దీంతో పెంచిన సేవా రుసుములతో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నిర్ణయంతో రవాణా శాఖకు ఆదాయం వస్తున్నప్పటికీ.. వాహనదారులపై ఆర్థిక భారం పెరిగిందని చెప్పవచ్చు.

– అక్షరటుడే, ఇందూరు

రవాణా శాఖలో సేవా రుసుములను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గతనెల 22న జీవో.నం. 51 విడుదల చేసింది. ఈ ఉత్తర్వులను తక్షణమే జిల్లా కార్యాలయాల్లో అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతిరోజు 150 వరకు దరఖాస్తులు వస్తున్నాయి. సేవా రుసుమును పెరగడంతో గత 20 రోజులుగా రవాణా శాఖకు ఆదాయం పెరిగింది. వాహనం నడిపే సమయంలో లెర్నింగ్ లేదా డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందే. అయితే సొంతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆర్టీఏ కార్యాలయాలకు వచ్చేవారికి సేవా రుసుము ఆన్‌లైన్ ఫీజు మాత్రమే పడుతుంది.

### ఏజెంట్లను సంప్రదిస్తే అదనపు భారం..

జిల్లాలోని చాలామంది వాహనదారులు లైసెన్సు, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ఏజెంట్లను సంప్రదిస్తున్నారు. దీంతో వారికి పెరిగిన సేవా రుసుములతో పాటు ఏజెంట్లు తీసుకునే కమిషన్ మరింత అదనపు భారంగా మారుతోంది. నిజానికి ఏ దరఖాస్తుకు ఎటువంటి పత్రాలను సమర్పించాలో.. పత్రాలను ఎలా నింపాలో తెలిస్తే ఏజెంట్లను సంప్రదించే అవసరమే ఉండదు. కానీ చాలామంది నేరుగా వారి వద్దకు వెళ్లడంతో అదనపు భారం తప్పడం లేదు.

ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించి నూతన వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్, లెర్నింగ్ లైసెన్స్‌లో పర్మిట్ సామర్థ్య పరీక్షలతో పాటు పన్నులను సైతం పెంచింది. వాహనం ఇన్వాయిస్ ధర ప్రకారం నూతన వాహనాల రిజిస్ట్రేషన్ పన్నులు పెంచారు.

### సేవా రుసుములు పెరిగాయి..

ఉమామహేశ్వర్ రావు, జిల్లా రవాణా శాఖ అధికారి రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించిన సేవా రుసుములను గత నెల 22న పెంచింది. అప్పటినుంచి అన్ని రుసుములు అమల్లోకి వచ్చాయి. వాహనదారులు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

### పెరిగిన ఛార్జీల వివరాలు ఇలా..

- లెర్నింగ్ లైసెన్స్ పరిమితి ఆరు నెలలు కాగా గతంలో రూ.100 సేవా రుసుము ఉండగా.. ప్రస్తుతం రూ.200 చేశారు.
- డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన పీవీసీ స్మార్ట్ కార్డుల సేవా రూసం ఐదేళ్ల కాల పరిమితికి లైట్ మోటార్ వెహికల్ వాహనానికి రూ.200 నుంచి రూ.300 కు పెంచారు. 20ఏళ్ల లోపు నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు రూ.300 నుంచి రూ.400కు పెంచారు.
- ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు రెండేళ్లలోపు రూ.100 నుంచి రూ.200, రెండేళ్ల పైన రూ.200 నుంచి 300 వరకు పెరిగాయి.
- వాహన పర్మిట్ ఛార్జీలను గతంలో ఉన్న రుసుము కన్నా రూ.100 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు.
- మూడు చక్రాల వాహనాల రిజిస్ట్రేషన్లు స్మార్ట్ కార్డులకు సంబంధించి ఏడాదిలోపు రూ.250 నుంచి రూ.300కు, ఏడాది కన్నా ఎక్కువగా ఉంటే రూ.300 నుంచి రూ.500 కు పెంచారు.

## వీరశైవ లింగాయత్ నూతన కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల వీరశైవ లింగాయత్ సమాజ్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా శివకుమార్ పటేల్, ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర పటేల్, ప్రధాన కార్యదర్శిగా జంగం దత్తు మహారాజ్, కోశాధికారిగా లక్ష్మణ్ పటేల్, జాయింట్ కార్యదర్శిగా మారుతి పటేల్ ను ఎన్నుకన్నారు. నూతన కమిటీ సభ్యులను ప్రకాష్ పటేల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. బసవేశ్వర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. వీర శైవ లింగాయత్ కమిటీ అభివృద్ధికి నిరంతరం పాటు పడుతానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శాంతిశ్వర్ పటేల్, కుశాల్ పటేల్, డిగంబర్ పటేల్, ప్రకాష్ పటేల్, విశ్వంబర్ పటేల్, నితిన్ పటేల్, రాజ్ కుమార్ పటేల్, సంతోష్ పటేల్, శివ కుమార్ పటేల్, సంజు పటేల్, ఓమన్న పటేల్, వీరశైవసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలకు బీరువా, స్టాడియో మీటర్ అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1985-86 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు బీరువా, స్టాడియో మీటర్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఎంఈవో నరేందర్‌కు పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో బ్యాచ్ సభ్యులు లక్ష్మీ నారాయణ, మగ్గిడి నర్సయ్య, రామగౌడ్ పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**అక్షరటుడే, నిజాంసాగర్:** పెద్ద కొడప్‌గల్ మండలంలోని టికారం తండాలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరై, ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో తండావాసులు, మాజీ ఎంపీపీ ప్రతాపరెడ్డి, నాయకుడు షేక్ మహమ్మద్ పాల్గొన్నారు.

## బహ్రెయిన్ నుంచి స్వదేశానికి రప్పించండి

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఉపాధి నిమిత్తం బహ్రెయిన్ వెళ్లి అక్కడ గాయపడిన తన తమ్ముడు ప్రసాద్‌ను స్వదేశానికి రప్పించాలని సిరికొండ మండలం చీమన్‌పల్లికి చెందిన ఆయన సోదరి లత సీఎం ప్రవాసీ ప్రజావాణిలో కోరింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 10న ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి తీవ్రగాయాలతో అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, మెరుగైన వైద్యం కోసం స్వదేశానికి రప్పించాలని వినతిపత్రంలో కోరింది. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచన మేరకు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి ఆమెకు మార్గదర్శనం చేశారు. చికిత్స చేయించి ప్రభుత్వ ఖర్చులతో ఇండియాకు రప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఘనంగా బారడి పోచమ్మ బోనాలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండలంలోని గొద్మేగాం గ్రామంలో మంగళవారం బారడి పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామంలో మహిళలు బోనాలను ఎత్తుకుని శివసత్తులు, బ్యాండ్ మేళాలతో ప్రధాన వీధుల మీదుగా ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



## ఆలూర్ పీఏసీఎస్ గోదాం తనిఖీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలంకేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల గోదాంను జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు యూరియా కొరత లేదని, అవసరానికి అనుగుణంగా ఎరువులు తీసుకోవచ్చని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగినంత స్టాక్ నిల్వ ఉంచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం వైస్ ఛైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సెక్రెటరీ మల్లేష్, సిబ్బంది ముత్యం, సురేష్, సీతగంగారాం, రైతులు పాల్గొన్నారు.

## కోట దుర్గమాత ఆలయంలో అన్నదానం




**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని కోటగల్లిలో కోట దుర్గామాత ఆలయంలో మంగళవారం కాలనీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు కురుపటి మమత యోగేశ్వర్ అన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారికి నలభై మూడు తులాల వెండి చెమాయిలను దాత బలరామన్ కేస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

## ఇవ్‌టీజింగ్‌కు పాల్పడితే షీటీంకు సమాచారం ఇవ్వాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా.. ఈవ్ టీజింగ్ చేసినా వెంటే షీటీం సభ్యులకు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుళ్లు, విగ్నేష్, సుమతి సూచించారు. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినుల పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. షీటీం 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ నవీన్ యాదవ్, వైస్ ప్రిన్సిపల్ రాకేష్, అధ్యాపకులు అర్చన, నవనీత, సుమలత, అరవింద్, రజనీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ఫొటోగ్రఫీ డే

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కెమెరా సృష్టికర్త అయిన లూయిస్ జాక్విస్ మండేదాగురే ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు పోచాగౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శులు సుదర్శన్ గౌడ్, యాదాగౌడ్, రాకేష్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.